## 93. సూరహ్ అ'ద్-'దు'హా

سُوْرَةُ الضُّحٰى

అ'ద్-'దు'హా: ఎండ, పగలు, పగటి కాంతి, పూర్వాహ్ణం, The Forenoon, సూర్యోదయం తరువాత మధ్యాహ్నం వరకు ఉండే కాలం. సూరహ్ అల్-ఫజ్ర్ (89) తరువాత ఈ సూరహ్ అవతరింపజేయబడిందని వ్యాఖ్యాతలు అంటారు. దీని పేరు మొదటి ఆయత్ నుండి తీసుకోబడింది. మొదటి మక్కా కాలపు సూరహ్. ఇందులో **11** ఆయతులు ఉన్నాయి.

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۝

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

وَالضُّحٰى ۝

**1**. ప్రకాశవంతమైన ప్రొద్దుటి పూట (పూర్వాహ్ణం) సాక్షిగా!

وَالَّيْلِ اِذَا سَجٰى ۝

**2**. మరియు చీకటి పడ్డ రాత్రి సాక్షిగా![1]

مَا وَدَّعَكَ رَبُّكَ وَمَا قَلٰى ۝

**3**. (ఓ ము'హమ్మద్!) నీ ప్రభువు, నిన్ను త్యజించనూ లేదు మరియు నిన్ను ఉపేక్షించనూ లేదు.

وَلَلْاٰخِرَةُ خَيْرٌ لَّكَ مِنَ الْاُوْلٰى ۝

**4**. మరియు రాబోయే కాలం (జీవితం) నీ కొరకు మొదటి కాలం (జీవితం) కంటే ఎంతో మేలైనది![2]

وَلَسَوْفَ يُعْطِيْكَ رَبُّكَ فَتَرْضٰى ۝

**5**. మరియు త్వరలోనే నీ ప్రభువు నీకు (నీవు కోరేది) ప్రసాదిస్తాడు. దానితో నీవు సంతోష పడతావు.

اَلَمْ يَجِدْكَ يَتِيْمًا فَاٰوٰى ۝

**6**. (ఓ ము'హమ్మద్!) ఏమీ? నిన్ను అనాథునిగా[3] చూసి, ఆయన (అల్లాహ్) నీకు ఆశ్రయం కల్పించలేదా?

---

**1**. సజా: సకన, అంటే శాంతి నెలకొలిసప్పుడు, అంటే పూర్తిగా చీకటి పడినప్పుడు. అప్పుడు నిశ్శబ్దం మరియు నెమ్మది ఉంటుంది.

**2**. అంటే పరలోక జీవితం, ఇహలోక జీవితం కంటే ఉత్తమమైనది.

**3**. దైవప్రవక్త ('స'అస) అనాథునిగా ఉంటే అల్లాహ్ (సు.తా.) అతనికి ఆశ్రయం కల్పించాడు. అతని తండ్రి అతని పుట్టుకకు కొన్ని మాసాల ముందు చనిపోయారు. తల్లి అతను 6 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు చనిపోయింది.

وَوَجَدَكَ ضَآلًّا فَهَدَىٰ ۝٧

7. మరియు నీకు మార్గం తోచనప్పుడు, ఆయన నీకు మార్గదర్శకత్వం చేయలేదా?[1]

وَوَجَدَكَ عَآئِلًا فَأَغْنَىٰ ۝٨

8. మరియు ఆయన, పేదవానిగా చూసి, నిన్ను సంపన్నుడిగా చేయలేదా?

فَأَمَّا ٱلْيَتِيمَ فَلَا تَقْهَرْ ۝٩

9. కాబట్టి నీవు అనాథుల పట్ల కఠినంగా ప్రవర్తించకు;

وَأَمَّا ٱلسَّآئِلَ فَلَا تَنْهَرْ ۝١٠

10. మరియు యాచకుణ్ణి కసరుకోకు;

وَأَمَّا بِنِعْمَةِ رَبِّكَ فَحَدِّثْ ۝١١

11. మరియు నీ ప్రభువు అనుగ్రహాలను బహిరంగంగా ప్రకటిస్తూ ఉండు.[2] (3/4)

## 94. సూరహ్ అలమ్ నష్రహ్

سُورَةُ الشَّرْحِ

అష్-షర్ హ్: The Opening Forth, విప్పటం, తెరవటం. సూరహ్ అ'ద్-'దు'హా (93) తరువాతనే ఇది కూడా అవతరింపజేయబడింది. దీని ఇతర పేర్లు సూరహ్ అల్-ఇన్షిరా'హ్ మరియు సూరహ్ అలమ్ నష్ర'హ్. మక్కాలో అవతరింపజేయబడిన ఈ సూరహ్‌లో 8 ఆయతులు ఉన్నాయి.

بِسْمِ ٱللَّهِ ٱلرَّحْمَٰنِ ٱلرَّحِيمِ

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

أَلَمْ نَشْرَحْ لَكَ صَدْرَكَ ۝١

1. * (ఓ ము'హమ్మద్!) ఏమీ? మేము నీ కొరకు నీ హృదయాన్ని తెరువలేదా?[3]

---

1. ము'హమ్మద్ ('స'అస)ను ప్రవక్తగా ఎన్నుకొని అతనికి ఖుర్ఆన్ ప్రసాదించి, మార్గదర్శకత్వం చేశాడు.

2. అంటే అల్లాహ్ (సు.తా.) చేసిన అనుగ్రహాలను, ఇతరులతో చెప్పుకో - అది అల్లాహ్ (సు.తా.)కు ఇష్టమైనది - గర్వంతో కాక నమ్రతతో!

3. గడచిన సూరహ్‌లో 3 కానుకలు పేర్కొనబడ్డాయి. ఈ సూరహ్‌లో 3 అనుగ్రహాలు పేర్కొన బడ్డాయి. ఎదను తెరవటం - అంటే సత్యాన్ని గ్రహించటం, జ్ఞాన జ్యోతి పొందడం. చూడండి, 6:125. అంటే మార్గదర్శకత్వాన్ని అర్థం చేసుకొని గ్రహించటం. రెండు సార్లు దైవప్రవక్త ('స'అస) ఎద చీల్చబడిందని స. హదీసుల ద్వారా తెలుస్తుంది. ఒకసారి బాల్యంలో అప్పుడు అతని వయస్సు 4 సంవత్సరాలుంటుంది. అప్పుడు జిబ్రీల్ ('అ.స.) వచ్చి, అతని ఎదను చీల్చి అతని హృదయంలో నున్న షై'తానుకు చోటిచ్చే భాగాన్ని తీసి వేస్తారు, ('స. ముస్లిం). రెండవసారి మేరాజ్‌కు ముందు జిబ్రీల్ ('అ.స.) అతని ఎదను చీల్చి హృదయాన్ని బయటికి తీసి, 'జమ్'జమ్‌తో దానిని కడిగి పెడ్తారు. దానిని విశ్వాసం (ఈమాన్) మరియు వివేకంతో నింపుతారు. ('స'హీ'హైన్).